## క్లుప్తంగా

### బాలినేనికి కృతజ్ఞతలు



బాలినేనికి కృతజ్ఞతలు తెలుపుతున్న రమాదేవి

**ఒంగోలు:** ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్‌గా తనకు అవకాశం కల్పించినందుకు జిల్లెళ్లమూడి రమాదేవి మంగళవారం బాలినేనిని ఆయన నివాసంలో కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. ప్రకాశం, కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలోని ఏపీసీపీడీసీఎల్‌కు డైరెక్టర్‌గా ఆమె బాధ్యతలు నిర్వహిస్తారు. గతంలో ఏపీఎస్‌పీడీసీఎల్‌కు డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. తాజాగా మరోమారు తనకు అవకాశం కల్పించినందుకు బాలినేనిని దుశ్శాలువాతో సత్కరించారు.

### నేడు మస్తాన్‌దర్గా ఉరుసు మహోత్సవం

**ఒంగోలు టౌన్:** హజరత్ సయ్యద్ గోరే మస్తాన్ అవులియా మస్తాన్‌దర్గా 44వ ఉరుసు మహోత్సవాన్ని బుధవారం రాత్రి 11 గంటలకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉరుసును పురస్కరించుకుని స్థానిక గోపాల్‌నగర్ ఒకటో లైన్‌లోని పూరిమట్ల కృష్ణ గృహం నుంచి ఫకీర్ల జల్సాతో, నవరంగ్ మేళ వాయిద్యాలతో, పూల పల్లకీపై బయలుదేరి హజరత్ సయ్యద్ గోరే మస్తాన్ అవులియా గంధ మహోత్సవం గురువారం ఉదయం 6 గంటలకు దర్గాకు చేరుతుందని తెలిపారు. అదే రోజు సాయంత్రం అఖండ దీపారాధన, రాత్రి మీలాదే షరీఫ్, శుక్రవారం తెల్లవారుజామున తహలీల్ ఫాతెమా కార్యక్రమాలు జరుగుతాయని, వేలాదిగా భక్తులు తరలిరావాలని కోరారు.

### వారంలోగా ఈ క్రాప్ నమోదు చేయాలి

**హనుమంతునిపాడు:** రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలకు వారం రోజుల్లోగా ఈ క్రాప్ నమోదు పూర్తి చేసి నివేదిక అందజేయాలని కనిగిరి డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ ఈ వెంకటరమణ సిబ్బందికి సూచించారు. ఈ క్రాప్ బుకింగ్ చేసిన తర్వాత సూపర్ చెక్ తనిఖీకి వచ్చిన పొలాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఉమ్మనపల్లి, రంగంపేట, సీతారాంపురం గ్రామాల్లో ఫీల్డ్ పరిశీలనలో భాగంగా సర్వే నంబర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ రైతులు వాస్తవంగా సాగుచేసిన ప్రతి పంటను ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. ఈ క్రాప్ బుకింగ్ అయిన తర్వాత తంబు వేసి పంటలను ధ్రువీకరించాలని రైతులకు తెలిపారు. అనంతరం రైతు భరోసా కేంద్రాల సిబ్బందితో మాట్లాడుతూ నాలుగు రోజుల్లో ఈ క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలన్నారు. వాస్తవంగా సాగుచేసిన పంటలను పరిశీలించి ఈ క్రాప్ నమోదు చేయాలన్నారు. పంటలు సాగుచేయకుండా ఈ క్రాప్ నమోదు చేసిన వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏవో బి.సంపత్‌కుమార్, వీఆర్వో సుబ్బయ్య, వ్యవసాయ సహాయకులు రబ్బాని, సంధ్యాని, ఆర్.సుప్రజ రైతులు పాల్గొన్నారు.

**గుడ్లూరు:** రైతులు సాగు చేసిన ప్రతి పంటను ఈ-పంటలో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.రవికుమార్ అన్నారు. మండల కేంద్రమైన గుడ్లూరులో సాగులో ఉన్న పత్తి పంట ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని ఏఓ మంగళవారం పరిశీలించారు. పత్తి మొక్కలకు పేను బంక ఉండటాన్ని గమనించిన ఏఓ రైతులకు దాని నివారణకు పలు సూచనలు చేశారు. ఎక్టిమాప్రైడ్ 20శాతం ఎస్పీ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి ఆకులపై పిచికారి చేయాలన్నారు. లేదా ఇమిడా క్లోరోప్రైడ్ 75 ఎస్ఎల్ 0.25 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి వీటితో పాటు వేపనూనె కలిపి పిచికారి చేస్తే పేనుబంకను సమర్థవంతంగా నివారించవచ్చన్నారు. ఏఓ వెంట వీఏఏ సౌభాగ్యవతి ఉన్నారు.

### భైరవకోన హుండీల ఆదాయం రూ.2.90 లక్షలు

**సీఎస్ పురం:** హుండీల ద్వారా ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోన ఆలయానికి రూ.2,90,701 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ సిద్దు రమణారెడ్డి తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ కందుకూరు ఇన్‌స్పెక్టర్ జీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం భైరవకోనలో హుండీల ఆదాయాన్ని లెక్కించారు.

### దేవస్థాన భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

**పామూరు:** దేవస్థాన భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ గ్రంధి మాధవి హెచ్చరించారు. పామూరులోని విరువూరు రోడ్డులో శ్రీమదన వేణుగోపాలస్వామి, వల్లీసమేత భుజంగేశ్వరస్వామి దేవస్థానాలకు చెందిన భూములు ఆక్రమణకు గురవుతున్నట్లు అందిన సమాచారం మేరకు మంగళవారం ఆ భూములను ఆమె పరిశీలించారు. సర్వేనంబర్ 257/2లో గల 1.26 ఎకరాల స్థలాన్ని కొందరు చదునుచేసి ఉండటాన్ని గమనించిన ఆమె.. ఈ భూమి దేవస్థానానికి చెందినదని, తమదనే వారు ఎవరైనా ఉంటే.. దానికి సంబంధించిన ఆధారాలతో అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. దేవస్థానానికి సంబంధించిన ప్రతి భూమిలో బోర్డులు ఏర్పాటు చేస్తామని, అవసరమైనచోట ఫెన్సింగ్ వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వేణుగోపాల, భుజంగేశ్వర ఆలయాల ఈవో వెలగం శ్రీనివాస్, యోగి, యుగంధర్, దేవస్థాన పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి పనులకు ఆమోదం



నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ కార్యాలయ భవనాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను సత్కరిస్తున్న చీమకుర్తి మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, అధికారులు

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు సత్కారం

**చీమకుర్తి:** చీమకుర్తి మున్సిపాలిటీలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలు అభివృద్ధి పనులకు పాలకమండలి సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సిమెంట్ రోడ్లు, సైడు కాలువల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. పలు సచివాలయాలకు అద్దెలు చెల్లించడం, డంపింగ్ యార్డు చుట్టూ రూ.15 లక్షలతో ప్రహరీ నిర్మాణం, రామ్‌నగర్‌లో రూ.10 లక్షలతో సిమెంట్ రోడ్డు, సైడు కాలువలు నిర్మించేందుకు సభ్యులు ఆమోదించారు. దాంతో పాటు మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసేందుకు ఐదుగురు ఇంజినీర్లను ఒక్కొక్కరికి నెలకు రూ.12 వేల చొప్పున ఏడాది కాలం పనిచేసేందుకు నియమించుకోవడానికి, మున్సిపాలిటీలో అవసరమైన న్యాయ సలహాలు అందించేందుకు అవసరమైన న్యాయవాదిని నియమించుకునేందుకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో తొలుత ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను పాలకవర్గ సభ్యులు, కమిషనర్ చేతుల మీదుగా శాలువా కప్పి సత్కరించారు. రిపబ్లిక్ డే సందర్భంగా ప్రశంసపత్రం అందుకున్న కమిషనర్ ఫజులుల్లాని కూడా ఈ సందర్భంగా కౌన్సిలర్లు సత్కరించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ కార్యాలయ భవనాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వెంకాయమ్మ పరిశీలించారు. భవనంలోని రూముల గురించి కమిషనర్ వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆక్వా జోనేషన్‌తో ఎన్నో ఉపయోగాలు



గ్రామ సభలో మాట్లాడుతున్న ఏడీ ఉషారాణి

**కొత్తపట్నం:** ఆక్వా జోనేషన్‌లో ఆక్వా భూములను చేర్చడం వలన భవిష్యత్‌లో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని మత్స్యశాఖ ఏడీ ఉషాకిరణ్ అన్నారు. మండలంలోని మడనూరు, ఈతముక్కల, రాజుపాలెం, మోటుమాల గ్రామాల్లో మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. ఏడీ మాట్లాడుతూ రొయ్యలు సాగు చేసే ప్రతి ఆక్వా రైతు భూములను జోనేషన్‌లో చేర్చుకోవాలని సూచించారు. పది ఎకరాల్లోపు ఉన్న రైతులు, రిజిస్ట్రేషన్ భూములు, డీకే భూములు హెచ్‌ల్యాండ్‌లో ఉన్న వారికి ఇది వర్తిస్తుందన్నారు. గ్రామ సభలో తీర్మానం చేసిన వెంటనే జిల్లా స్థాయిలో తీర్మానం చేసి జోనేషన్‌లో చేరుస్తామన్నారు. ఈ ప్రక్రియ అయిన తర్వాత వారికి సబ్సిడీ వర్తిస్తుందన్నారు. రైతులు మాట్లాడుతూ పది ఎకరాల రొయ్యల చెరువులకు సబ్సిడీ వర్తిస్తుందన్నారు. దానికి 60 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్ పెట్టుకున్నవారికి సబ్సిడీ వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని అడిగారు. రొయ్యల చెరువులు సాగు చేసేవన్నీ డీకే భూములని, డీకే భూములు 90 శాతం హెచ్‌ల్యాండ్‌లో లేవని, ఈ సమాచారాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వివరించారు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసికెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో ఆషా, గ్రామ ఫిషరీస్ అసిస్టెంట్ డేవిడ్, రైతులు పాల్గొన్నారు.

## వలంటీర్లకు ఇంటర్వ్యూలు



గ్రామ వలంటీర్లకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీవో సుజాత

**కొత్తపట్నం:** గ్రామ సచివాలయాల్లో సేవలందించడానికి వలంటీర్లకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీవో పి.సుజాత తెలిపారు. మంగళవారం నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఆలూరు 1, రంగాయపాలెం 1, గమ్మళ్లపాలెం 1కు వలంటీర్లను నియమించినట్లు చెప్పారు. వారికి గ్రామ అభివృద్ధి, ప్రజలతో ఎలా ఉండాలి, సంక్షేమ పథకాలను ప్రజలకు ఎలా చేరవేయాలో వివరించారు. వారి సర్టిఫికెట్లు చూసి పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, సీనియర్ అసిస్టెంట్ సుదర్శన్, జూనియర్ అసిస్టెంట్ సాయి తేజ పాల్గొన్నారు.

# విలువలు చాటిన మహాకవి.. వేమన



డాక్టర్ వైష్ణవిని సత్కరిస్తున్న ప్రతినిధులు

**కొత్తపట్నం:** పద్యరూపంలో విలువలు చాటిన మహాకవి.. వేమన అని కొత్తపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వైష్ణవి అన్నారు. స్థానిక శ్రీవాణి విద్యానికేతన్ హైస్కూల్లో మంగళవారం జానుడి సెంటర్ ఫర్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్, శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో వెయ్యి మందితో వేమన పద్యం కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపాల్ చాపల కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వైష్ణవి మాట్లాడుతూ శతక పద్యాల పఠనంతో విద్యార్థుల్లో ఏకాగ్రతతో పాటు విలువలు కూడా పెంపొందింపబడతాయన్నారు. నీతి భక్తి శతకాల అధ్యయనం ద్వారా విద్యార్థులు క్రమశిక్షణ గల పౌరులుగా ఎదుగుతారని వివరించారు. డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ ఒంగోలులోని పలు పాఠశాలల్లో వెయ్యి మందితో వేమన పద్యం కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. విద్యార్థుల్లో ఏకాగ్రతతో పాటు మాననీయ విలువలు పెంపొందించడమే లక్ష్యంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త పిన్ని వెంకటేశ్వర్లు వేమన పద్యాలలోని అంతరార్థాన్ని వివరించారు. కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు వేమన పద్యాలను రాగయుక్తంగా ఆలపించి అందరు విద్యార్థులతో పలికించారు. అనంతరం డాక్టర్ వైష్ణవిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జానుడి సాహితీ సంస్థ డైరెక్టర్ డాక్టర్ నూకతోటి రవికుమార్, ఉపాధ్యాయులు కోటేశ్వరమ్మ, అశ్విని, పీతా కోటేశ్వరరావు, వినుకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## కమర్షియల్ ట్యాక్స్ ఎస్సీ ఎంప్లాయీస్ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

**ఒంగోలు సబర్బన్:** ఆంధ్రప్రదేశ్ కమర్షియల్ ట్యాక్స్ ఎస్సీ ఎంప్లాయీస్ అసోసియేషన్ డైరీని మంగళవారం ఆ శాఖకు చెందిన అసిస్టెంట్ కమిషనర్లు ఒంగోలు-1 దుంపా ఝాన్సీ, ఒంగోలు-2 సోమసుందర ప్రసాద్ ఆవిష్కరించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పైనం మల్లిఖార్జున రావు ఆధ్వర్యంలో స్థానిక కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన అధికారులు అనంతరం డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇటీవల అవార్డులు తీసుకున్న జీఎస్టీఓ ఎన్‌పీకే ప్రసన్న కుమార్ రెడ్డి, ఏఈఓ ఆర్ వెంకటరెడ్డిలను ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీటీఓ సుబ్బారావు, శ్రీనివాస ప్రసాదు, సుధాకర్, గుడి శ్రీనివాసరావు, జీఎస్టీఓలు నిర్మలాదేవి, సుగుణ, వంశీకృష్ణ, బాల ప్రసన్న కుమార్, పెద్దమ్మాయితో పాటు పలువురు పాల్గొన్నారు.

# క్యాన్సర్ వైద్య శిబిరం విజయవంతం




మాట్లాడుతున్న డాక్టర్ సాయికృష్ణ

**ఒంగోలు రూరల్:** మండలంలోని కరవది గ్రామ సచివాలయంలో హెచ్‌సీజీ-ఎంఎన్ఆర్ క్యాన్సర్ సెంటర్ ఒంగోలు వారి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన క్యాన్సర్ అవగాహన వైద్యశిబిరం విజయవంతమైంది. డాక్టర్ సాయికృష్ణ మెడికల్ అంకాలజిస్ట్ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల ద్వారా, వంశపారంపర్యంగా పోస్ట్ జనరేషన్‌లో క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. క్యాన్సర్ వ్యాధిని గుర్తించడంలో పలు జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణాపాయం ఉండదని తెలిపారు. ఇందుకు క్యాన్సర్‌పై తగు అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ సందర్భంగా మహిళలకు క్యాన్సర్ వ్యాధి వచ్చే అవకాశాలు, గర్భకోశ వ్యాధులు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రారంభం కార్యక్రమంలో కరవది గ్రామ సర్పంచ్ డి.కోటేశ్వరరావు, కార్యదర్శి పూర్ణచంద్రరావు, కార్యదర్శి-2 శ్రీలక్ష్మి మాట్లాడారు. అనంతరం క్యాన్సర్ వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురికి వ్యాధి నిర్ధారక పరీక్షలు, అనుమానితులకు తగిన పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటకృష్ణ, క్యాన్సర్ సెంటర్ మార్కెటింగ్ మేనేజర్ మోహన్‌కుమార్, ఏఎన్ఎంలు, జీఎస్ఎంలు పాల్గొన్నారు.

# రామ్‌నగర్‌లో మడియాలమ్మ జాతర



ప్రభపై మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

**చీమకుర్తి:** మడియాలమ్మ తల్లి తిరునాళ్ల సందర్భంగా సోమవారం రాత్రి చీమకుర్తి పట్టణంలోని రామ్‌నగర్‌లో స్థానికులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభపై మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మడియాలమ్మ తిరునాళ్ల సందర్భంగా ప్రతి ఏటా రజకులు నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అభినందనీయమని ప్రోత్సహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు, ప్రేక్షకులు పాల్గొన్నారు.

# వెటర్నరీ అంబులెన్స్ కేటాయింపుపై హర్షం



సీఎస్ పురం పశువైద్యశాల వద్ద ఉన్న వెటర్నరీ అంబులెన్స్

**సీఎస్ పురం:** మూగజీవాలకు మెరుగైన వైద్యసేవలు అందించే లక్ష్యంతో వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ (వెటర్నరీ) అంబులెన్స్‌ను సీఎస్ పురం మండలానికి ప్రభుత్వం కేటాయించడంపై మండలంలోని పశుపోషకులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలో 65 వేల గొర్రెలు, 19 వేల మేకలు, 25 వేల గేదెలు, 3 వేలకుపైగా ఆవులు ఉన్నాయి. మారుమూల ప్రాంతం కావడంతో ప్రభుత్వం రెండో విడతలో నియోజకవర్గానికి పంపించిన వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ అంబులెన్స్‌ను అధికారులు సీఎస్ పురం మండలానికి కేటాయించారు. దీంతో జనవరి 26వ తేదీ స్థానిక పశువైద్యశాల వద్దకు ఈ అంబులెన్స్ చేరింది. అంబులెన్స్‌లో పశువైద్యుడు, వెటర్నరీ డిప్లమా సహాయకుడు, డ్రైవర్ కం అటెండర్ ఉంటారు. తమ పశువులకు సకాలంలో వైద్య సేవలు అందించే ఏర్పాట్లు చేయడంతో మండలంలోని పశుపోషకులు హర్షం వెలిబుచ్చుతున్నారు.

# బాధ్యతగా పనిచేయండి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీవో ఉషారాణి

- డీఎల్‌డీవో, జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి ఉషారాణి

**ఒంగోలు రూరల్:** సచివాలయ వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశం కల్పించిందని, వారంతా బాధ్యతగా పనిచేయాలని డీఎల్‌డీవో అండ్ జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి టి.ఉషారాణి సూచించారు. ఒంగోలు మండలంలోని కరవది సచివాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా బయోమెట్రిక్ అటెండెన్స్, యూనిఫాం నిబంధనలను నిశితంగా పరిశీలించారు. నామినేషన్ సర్వీస్ తప్పనిసరిగా 25 చేయవలసి ఉందని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన 61 జీవో ప్రకారం ప్రతి సచివాలయంలో 108 రిజిష్టర్లు నిర్వహించాలని, ఈ సమాచారాన్ని గతంలో అన్ని సచివాలయ కార్యదర్శులకు అందజేసి శిక్షణ ఇచ్చామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల వద్దకు చేర్చే బాధ్యత కేవలం సచివాలయ ఉద్యోగులపై ఉందన్నారు. అర్హులైన వారందరికీ ఆయా పథకాలు అమలు చేయాలని ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా జగనన్న చేదోడు, నవరత్నాల పథకాల్లో భాగమైన పేదలందరికీ గృహ కల్పన, ఇళ్ల స్థలాల పంపిణీ, చిరు వ్యాపారులకు అందజేసిన ఆర్థిక సాయం, రైతులకు అందిస్తున్న పథకాల గురించి కార్యదర్శి పూర్ణచంద్రరావు, మరో కార్యదర్శి శ్రీలక్ష్మి నుంచి వివరాలు సేకరించారు. అన్ని రిజిష్టర్లలో ఎప్పటికప్పుడు పూర్తి సమాచారం నమోదు చేయాలన్నారు. సచివాలయాల సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

# పేదలకు విద్యనందించడమే డాన్‌బాస్కో లక్ష్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న బిషప్ ప్రకాష్

**ఒంగోలు టౌన్:** పేదలకు విద్యనందించి వారి అభివృద్ధికి తోడ్పడటమే డాన్‌బాస్కో ప్రధాన లక్ష్యమని బిషప్ ఆఫ్ నెల్లూరు ఎండీ ప్రకాష్ స్పష్టం చేశారు. స్థానిక గోరంట్ల రోడ్డులోని ఆగ్జీలియం హైస్కూల్‌లో మంగళవారం డాన్‌బాస్కో వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిషప్ మాట్లాడుతూ భారతదేశంలోకి డాన్ బాస్కో సంస్థ ప్రవేశించి వందేళ్లు పూర్తయిందన్నారు. ఆరుగురు సిస్టర్స్‌తో ప్రారంభమైన సంస్థ నేడు వేలాది మందితో పేదలకు విద్యతో పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. డాన్ బాస్కో సంస్థలలో అనేక మంది ఉద్యోగ ఉపాధి కోర్సులు పూర్తిచేసి జీవితంలో స్థిరపడ్డారన్నారు. డాన్‌బాస్కో సంస్థ ఒంగోలుకు వచ్చి 21 ఏళ్లయిందని, విద్యతో పాటు మహిళలకు చేతివృత్తుల్లో శిక్షణ ఇస్తూ సమాజసేవ చేస్తోందని చెప్పారు. అనంతరం హోలీమాస్ నిర్వహించి పాఠశాల విద్యార్థులకు ఆశీర్వాదాలు అందజేశారు. కార్యక్రమంలో హైస్కూలు కరస్పాండెంట్ సిస్టర్ లూసి అప్పమ్మ, సిస్టర్లు లూసియా రాణి, థెరిసా, అనూష, డైరెక్టర్ ఫాదర్లు జోష్, దాసు, రాజశేఖర్, ప్యారిస్ ప్రీస్ట్ డీఎస్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 2 నుంచి ప్రజా పోరు యాత్ర

**ఒంగోలు:** ప్రజా పోరు యాత్ర-2ను మార్చి 10 నుంచి నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యం ప్రజల్లో ఉండి ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ మార్చి 30వ తేదీ వరకు యాత్ర నిర్వహిస్తామన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు. దీనదయాల్ వర్ధంతి సందర్భంగా ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అదే విధంగా యువమోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 4, 5, 6 తేదీల్లో మినీ స్టేడియంలో కబడ్డీ పోటీలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పులి వెంకట కృష్ణారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిరసనగండ్ల శ్రీనివాసులు, సెగ్గెం శ్రీనివాసరావు, కార్యదర్శి జువ్విగుంట కోటేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి

**ఒంగోలు టౌన్:** ఒంగోలులోని పాత జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 2వ తేదీ నిర్వహించనున్న దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలని జిల్లా నాయకులు కొండరాజు రవణయ్య, మంకెన సులోచనరాణి, యల్లాల శివక్రిష్టారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర పురపాలక శాఖామంత్రి ఆదిమూలపు సురేష్, పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసుల రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, జిల్లాలోని ఎమ్మెల్యేలు బుర్రా మధుసూదనయాదవ్, మద్దిశెట్టి వేణుగోపాల్, అన్నా రాంబాబు, కుందురు నాగార్జునరెడ్డి, టీజేఆర్ సుధాకర్‌బాబు, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, మాజీ ఎమ్మెల్యేలు బూచేపల్లి శివప్రసాదరెడ్డి, కదిరి బాబూరావు, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్ రాజు, రాష్ట్ర దివ్యాంగులు, వయోవృద్ధులు, హిజ్రాల కార్పొరేషన్ చైర్మన్ ముంతాజ్ పఠాన్ తదితరులు హాజరుకానున్నారని వివరించారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు, దివ్యాంగుల నాయకులు భారీ సంఖ్యలో పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు.

# బైక్ ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

**వెలిగండ్ల:** మండల పరిధిలోని పద్మాపురం మలుపు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలవగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. గొల్లపల్లికి చెందిన చిన నాగయ్య మొగళ్లూరు నుంచి గొల్లపల్లికి బైక్‌పై వెళ్తున్నాడు. తమ్మినేనిపల్లికి చెందిన కర్నాటి వెంకటరెడ్డి కనిగిరి నుంచి తమ్మినేనిపల్లికి బైక్‌పై వస్తున్నాడు. పద్మాపురం మలుపు వద్ద రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో చిననాగయ్య తలకు తీవ్ర గాయమైంది. 108 వాహనం రావడం ఆలస్యం కావడంతో క్షతగాత్రుడు చిననాగయ్యను ఎస్సై మహేష్‌కుమార్ పోలీసు వాహనంలో చికిత్స నిమిత్తం కనిగిరి తరలించారు. మెరుగైన వైద్యం కోసం చిన నాగయ్యను ఒంగోలు తరలించారు.

# అధికారులు ప్రగతి సాధించాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి అర్జున్‌నాయక్

**వెలిగండ్ల:** అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సంక్షేమం, అభివృద్ధి పనుల్లో ప్రగతి సాధించాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేక అధికారి అర్జున్‌నాయక్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ఎంపీడీవో టి.సుకుమార్ అధ్యక్షతన మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వారం జరిగిన పనులు, సంక్షేమ పథకాల అమలు తీరుపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ భవనాలు, సచివాలయాలు, మిల్క్ సెంటర్లు, ఆర్‌బీకేలు, ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పొదుపు మహిళలకు బ్యాంక్‌ల ద్వారా రుణాలు ఇప్పించాలన్నారు. గ్రామ సచివాలయాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో టి.సుకుమార్, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, ఎంఈవో దాసు ప్రసాద్, ఏఈలు పవన్‌కుమార్, మరియబాబు, ఏవో రంగకృష్ణ, ఏపీఎం లక్ష్మీనారాయణ, టీఏ మనోహర్ పాల్గొన్నారు.

## ప్రకటన

నాక్లైంటు చక్క లక్ష్మీనరసింహంగారి కుమారుడు, నరేంద్ర కుమార్, ఒంగోలు అనువారి సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది.

నాక్లైంటు 208.5/9 చ॥గజముల స్థలం Sy.57/1 అన్నవరప్పాడు, ఒంగోలు గల ఆస్తిని కునాం వెంకటరెడ్డి గారి నుండి కొనుగోలు చేయదలచినారు. పై ఆస్తి వెంకటరెడ్డి గారు, కె.చంద్రమౌళి గారి దగ్గర నుండి Reg. విక్రయ పత్రం తేది. 2/12/2009 D.No. 9321/2009 ద్వారా కొనుగోలు చేసినారు మరియు కె.చంద్రమౌళి గారికి పై ఆస్తి తన తండ్రి గారి అయిన సత్యనారాయణ శర్మ గారువ్రాసిన చివరి వీలునామా తేది.21/04/1999 ద్వార వచ్చినది. మరియు షెడ్యూలు ఆస్తి D.No. నెంబరు 37-1-415, దర్శిలా OMCలో DNo. 37-1-413 (133)గా మారినది. కావున పై ఆస్తి పై ఎవరికి ఎటువంటి అభ్యంతరములు ఉన్న తెలుపవలెను. లేని యెడల పై ఆస్తి నిర్వివాదమైన ఆస్తి అని నమ్మి నా క్లైంటు కొనుగోలు చేయును అని తెలుపడమైనది.

ఒంగోలు. తేది. 30-01-2023.

R.V.S.Bharadwaja, Advocate,
Ongole. Cell: 94937 81705

## ఉపాధి హామీ నిధులు స్వాహా



రికార్డులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ శీనారెడ్డి

- రూ.9.13 లక్షలు స్వాహా అయినట్లు సామాజిక తనిఖీలో వెల్లడి

**హనుమంతునిపాడు:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులలో 2021-22లో నిర్వహించిన పనులకు సంబంధించి రూ.9.13 లక్షలు స్వాహా అయినట్లు సామాజిక తనిఖీలో తేలింది. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆ వివరాలు వెల్లడించారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 14 సచివాలయాల పరిధిలో ఉపాధి పనులు, పంచాయతీ పనులు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య సెంటర్ల నిర్మాణం, పండ్ల తోటల పెంపకం, సోషల్ ఫారెస్టు, మొక్కల పెంపకం పనులను రూ.11.30 కోట్లతో నిర్వహించారు. వాటిపై గత వారం నుంచి సామాజిక తనిఖీ టీంలు తనిఖీలు నిర్వహించి నివేదికలు తయారు చేశారు. ఎంపీపీ గాయం సావిత్రి అధ్యక్షతన ప్రజావేదిక నిర్వహించి పంచాయతీల వారీగా నివేదికను పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో డ్వామా పీడీ శీనారెడ్డి మాట్లాడుతూ స్వాహా అయిన రూ.9.13 లక్షలను సంబంధిత అధికారులు, నిర్వాహకుల నుంచి తప్పనిసరిగా రికవరీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీవీ కృష్ణారావు, ఎస్ఆర్‌పీ మాధవరావు, జిల్లా విజిలెన్స్ అధికారి వెంకటస్వామి, అంబుడ్స్‌మెన్ షేక్ మీరావలి, వైస్ ఎంపీపీ కె.బెంజి, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి పాల్గొన్నారు.